తిరుమల ముస్తాబు

రెండు రోజుల సిఎం పర్యటన సందర్భంగా తిరుమలను టిటిడి అధికారులు మరింత ముస్తాబుచేశారు. ఆలయం ముందు భాగంలో, స్వామివారి పుష్కరిణికి వెళ్ళే మార్గం, అన్నదానం భవనంవెళ్ళే మార్గంలో పూర్తిగా కూల్‌పెయింట్ వేశారు. ఆ ప్రాంతాల్లో పచ్చన మొక్కలు, పూలకుండీలు ఏర్పాటు చేశారు.

ప్రభాతవార్త, తిరుమల

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

తిరుమలలో సిఎం చంద్రబాబు

-నేటి ఉదయం వెంకన్న దర్శనం

తిరుమల,మార్చి 20ప్రభాతవార్తప్రతినిధి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుటుంబంతో కలసి గురువారంరాత్రి 11.30గంటలకు తిరుమలకు చేరుకున్నారు.మనవడు నారాదేవాన్ష్ పుట్టినరోజున శ్రీవారి ఆశీస్సులందుకోవడానికి రావడంతో పద్మావతి విశ్రాంతి గృహం వద్ద సాదర స్వాగతం లభించింది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, రాష్ట్రమంత్రి రామానారాయణరెడ్డి, టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. సిఎం పర్యటన ప్రాంతాల్లో పూర్తిగా మీడియాను నిషేధించారు. చంద్రబాబు కార్యక్రమాలకు అధికారుల అత్యుత్సాహంతోనే మీడియాను దూరం చేయడం విమర్శలకు తావిస్తోంది.

భావిభారతానికి సంస్కృతాన్ని

మరింత చేరువచేయాలి

- ఎన్ ఎస్ యూ ఛాన్సలర్,పద్మభూషణ్ ఎన్ గోపాలస్వామి
-ఘనంగా ఎన్ఎస్ యూ నాల్గొవ స్నాతకోత్సవం

తిరుపతి విద్య, మార్చి 20 ప్రభాతవార్త జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృత భాషకు విశ్వగురువుగా వెలుగొందుతుండటం హర్ష నీయమని ఎన్ఎస్‌యూ ఛాన్సలర్, పద్మభూషణ్ ఎన్ గోపాలస్వామి పేర్కొన్నారు. తిరుపతి మహతి ఆడిటోరియం వేదికగా గురువారం ఎన్ఎస్ యూ నాల్గొవ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి పీజీ, యూజీ,పీహెచ్‌డీ పట్టాల ప్రధానోత్సవానికి అధికారికంగా అనుమతించారు.దీంతో 564మంది యూజీ, పీజీ, డిప్లొమో విద్యార్థులకు, 75 మంది పీహెచ్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. అలాగే వర్సిటీలో పలు కోర్సులలో అకడమిక్ విద్యలో ప్రతిభ చూపి టాపర్లకు నిలిచిన 22 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత కేంద్రీయ సంస్కృత విద్యాపీఠంగా ఆవిర్భవించి అంచెలంచెలుగా ఎదుగుతూ కేంద్రీయ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొంది నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడం గర్వించ దగ్గ విషయమన్నారు.వర్సిటీలో నూతన పరిశోధనలకు హర్షనీయమన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి వర్సిటీ ప్రగతిని,ప్రణాళికలను, సాధించి విజయాలను సభ ముందుంచారు. అనంతరం ఛాన్సలర్స్ ను వర్సిటీ అధికారులు జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకట నారాయణ రావు, డీన్లు దక్షణమూర్తి శర్మ, రజినీకాంత్ శుక్లా, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత జిల్లా ఎమ్మెల్యేలపై

అవినీతి మరకలు!

-జనానికి జవాబుదారేదీ"బాబు"
-కార్యకర్తలకూ దూరంగానే ఉన్నారంట!!

ప్రభాతవార్త-తిరుపతి: నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని...వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా శ్రద్ధ చూపాలని పదేపదే అధినేత, సిఎం చంద్రబాబునాయుడు నిర్దేశిస్తున్నా సొంత జిల్లాలో పార్టీ ఎమ్మెల్యేలు పూర్తిగా బేఖాతర్‌చేయడంలేదనేది కార్యకర్తల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఏకంగా కొందరు ఎమ్మెల్యేలు ఓటు వేసి గెలిపించిన జనానికి అందుబాటులో లేకపోతున్నారని, ఏకంగా ఇద్దరు ఎమ్మెల్యేలు చుట్టపుచూపుగా వచ్చివెళుతున్నారని ఆ ప్రజలు వాపోతున్నారు. ఇప్పుడు జనం ఏ ఆశతో ఓట్లేసి గెలిపించారో అదే సదభిప్రాయంతో ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారంలో ఐదురోజులు నియోజకవర్గాల్లోనే తిరగాలని పదేపదే సిఎం హెచ్చరిస్తున్నా పాటించేవారే లేదనేది కార్యకర్తలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. సొంత ఉమ్మడి జిల్లాలో 13మంది సొంత పార్టీ ఎమ్మెల్యేల్లో ఐదుగురు అవినీతి కార్యకలాపాల్లో మునిగిపోయారనే విషయాలు ఇంటిలిజెన్స్ వర్గాలు నివేదికలు పంపినట్లు తెలిసింది. ఇంకా మంత్రిపదవులు ఆశించిన కొందరు ఎమ్మెల్యేలు భంగపడటంతో పూర్తిగా ప్రజలకు దూరంగా ఉంటున్నారనేది గుప్పుమంటోంది. ఎమ్మెల్యేలు పనితీరు పై ప్రోగ్రెస్ తీసుకుంటున్నా పార్టీవాళ్ళకు కనీసం అందుబాటులో లేరనడం మరీ విచిత్రం. సొంత జిల్లాలో పార్టీ నేతలు, కార్యకర్తల్లో అసహనం,నిరాశ వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడి పదినెలలు పూర్తయినప్పటికీ కార్యకర్తలను ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదనేది ప్రధాన విమర్శ. ముఖ్యమంత్రి, అధినేత చంద్రబాబునాయుడు సొంత జిల్లాకు చెందిన వ్యక్తి అయినప్పటికీ కార్యకర్తలకు అందుబాటులో లేరన్న మాటలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు కూడా అలాగే వ్యవహరిస్తున్నారనేది ప్రధాన ఆరోపణలు. సొంత జిల్లానుండి సిఎం బాబు,మంత్రి ,యువనేత నారాలోకేశ్‌ను కలవాలంటే కూడా అపాయింట్‌మెంట్ దొరకడంలేదని చెబుతున్నారు. పార్టీయే ప్రాణంగా భావించి నాలుగుదశాబ్దాలుగా పార్టీకోసం పనిచేస్తున్న కీలక నేతలకు నామినేటెడ్ పదవులు దక్కలేదు. పదవులు చేజిక్కించుకున్న వాళ్ళు ఆయా ప్రాంతాల్లో కార్యకర్తలకు అందుబాటులో లేరనేది అధినేత వరకు వెళ్లిన ఫిర్యాదులు. ఇప్పటి పరిస్థితుల్లో వైసిపి నేతలను ధీటుగా ఎదురించే కూటమి నాయకులు, కనీసం విమర్శించే వాళ్ళు కూడా కరువయ్యారు. ఇందుకు ఇటీవల పుంగనూరులో టిడిపి కార్యకర్తను హత్య చేసినా స్పందన అంతంతమాత్రమేనని అంటున్నారు. అదేగాక జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, ఏకంగా పోలీసుశాఖలో ఎస్పీ నుండి డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, పోలీసులు వైసిపి నేతలకు వేగులుగా మారి వాళ్ళు చెప్పిందే ఇప్పుడూ పాటిస్తున్నారనే ఆరోపణలు టిడిపి నేతలు, కార్యకర్తలు వ్యక్తంచేస్తున్నారు. శుక్రవారం జిల్లాకు చెందిన కార్యకర్తలు అధినేతను కలసి తమ బాధలు చెప్పాలని సిద్ధమవుతున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- నలుగురు గాయాలు

క్షతగాత్రులు చికిత్స పొందుతున్న దృశ్యం

వెంకటగిరి, మార్చి 20, ప్రభాతవార్త మండలం వర్ధనపల్లి గ్రామ సమీపంలో ఆగి ఉన్న లారీనీ ఢీకొనడంతో పడారు రత్నమ్మ మృతిచెందగా నలుగురు గాయ పడ్డారు. వర్ధన పల్లి గ్రామం వద్ద ధాన్యం బస్తాలను లారీకి ఎక్కిస్తుండగా గూడూరు నుండి వెంకటగిరికి వస్తున్న కారు అదుపు తప్పి ఢీకొంది. గాయపడ్డ రత్నమ్మ వర్ధన పల్లి గ్రామానికి చెందిన మహిళ. గాయపడ్డ వెంకటశేషయ్య వెంకటేశ్వర్లు వర్ధన పల్లి గ్రామానికి చెందిన వారే. కారులోప్రయాణిస్తున్న కళ్యాణ్ రెడ్డి కూడా తీవ్రంగా గాయపడ్డాడు. గూడూరు నుండి వెంకటగిరి పైపు కారు వస్తుండగా ప్రమాదం జరిగింది. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఎస్సై సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బలవంతంగా రాజీనామాలు: పీల్డ్‌అసిస్టింట్లు

నాయుడుపేట మార్చి 20 ప్రభాతవార్త; ఉపాధిహామి పథకంలో క్షేత్రస్థాయిలో పీల్డ్‌అసిస్టింటుగా పనిచేస్తున్న మామ్ములను ఎపిఓ బలవంతంగా తొమ్మిదిమందిచే రాజీనామాలు చేయించారని ద్వామా ప్రాజెక్ట్‌డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్ ఎదుట పీల్డ్ అసిస్టింట్లు వాపోయారు. పలువురు ఉపాధిహామి పీల్డ్‌అసిస్టింట్లు మాట్లడుతూ అధికారపార్టీ నాయకుల అండదండలతో ఉపాధిహామి ఎపిఓ ఎస్‌డి షీలు మాపై ఒత్తిడితీసుకొచ్చి బలవంతంగా మాదగ్గర రాజీనామాలు చేయించారని ఆరోపించారు.నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ద్వామ పిడి శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు.అనంతరం సామాజిక తనిఖీ చేపట్టిన అధికారులు పంచాయితీలు వారిగా ఉపాధిహామి పనుల్లో జరిగిన అవకతవకలను పిడి దృష్టికి తీసుకొచ్చారు. నాయుడుపేట మండలంలోని పలుగ్రామపంచాయితీల్లో చేపట్టిన ఉపాధిహామి పనులలో మష్టర్‌లో కూలీల సంతకాలు పెటి ంచకనే పేమెంటు చేయడం,కూలీలు ఒకరికి బదులు మరొక్కరు పనికిపోవడం జరిగిందని తెలిపారు. మరికొన్ని గ్రామాల్లో పనికిపోయిన కూలీల పేర్లు రాయకుండ కంపెణిల్లో ఉద్యోగాలు చేసేవారి పేర్లు మష్టర్లులో నమోదు చేయడం లాంటి అవకతవకలు జరిగాయని వారు అధికారులు దృష్టికి తీసుకోచ్చారు. ద్వామ ప్రాజెక్ట్ డైరెక్ట్ శ్రీనివాసప్రసాద్ మాట్లడుతూ నాయుడుపేట మండలంలో 2023 నుండి 2024 వరకు అవకతవకలను 16వ విడత సామాజిక తనిఖీ బృందం గుర్తుంచి తమదృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు.19గ్రామపంచాయిల్లో సుమారు ఇరవైఐదువేలు పైన్‌వేసినట్లు తెలిపారు. 80వేలవరకు క్షేత్రస్థాయి అధికారులు,సిబ్బంది నుండి రికవరీ చేపడుతున్నట్లు తెలియజేశారు.ఎపిడి వరప్రసాద్,ఎంపిడిఓ సురేష్‌బాబు,ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి,ఎపిఓ ఎస్‌డి షీలు, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం

రేణిగుంట మార్చి 20 ప్రభాతవార్త రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో గురువారం రాత్రి ఘన స్వాగతం లభించింది. మనుమడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శ్రీవారి దర్శనార్థ ప్రత్యేక విమానంలో రేణిగుంట చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు డిజిపి షిమోజి బాజ్పాయ్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మున్సిపల్ కమిషనర్ మౌర్య,శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, నగిరి ఎమ్మెల్యే భాను ప్రకాష్, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీ కాళహస్తి బిజెపి ఇన్చార్జ్, రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్, జిల్లా బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి,రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, రేణిగుంట తహసిల్దార్ సురేష్ బాబు,వివిధ నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తెలుగుదేశం పార్టీ అభిమానులు కార్యకర్తలు స్వాగతం పలికారు. విమానాశ్రయం వెలుపల పలువురు చంద్రబాబుకు వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో భారీ భద్రత నడుమ తిరుపతి బయలుదేరి వెళ్లారు.

సారా రహిత సమాజ ఆవిష్కరణే లక్ష్యంగా విధులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు పిలుపు

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త: క్షేత్ర స్థాయిలో నాటు సారా రహిత సమాజ ఆవిష్కరణకు ప్రతి ఒక్కరు కలసికట్టుగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలులు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో గురువారం నాటు సారా రహిత సమాజం దిశగా ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమం అమలుపై కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు కలిసి ఎక్సైజ్, పోలీసు, ఫారెస్టు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా అటవీశాఖ అధికారి భరణి, ఎక్సైజ్ డిప్యుటీ కమీషనర్ విజయశేఖర్, ఎక్సైజ్ సూపరిటెండెంట్ శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 ద్వారా నాటు సారాను పూర్తిగా కట్టడి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమంను ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో విధులు నిర్వర్తించి సారా రహిత సమాజ ఆవిష్కరించడానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. నాటు సారా తయారీ, అమ్మకం, రవాణా చట్టరీత్యా నేరమని, పిడి కింద శిక్షకు గురికావడం జరుగుతుందని హెచ్చరించారు. నాటు సారా వినియోగంపై కలిగే అనర్థాలను ప్రజలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని, తయారీదారులు, వినియోగదారుల్లో మార్పు తీసుకురావాలన్నారు. జిల్లాలో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, కార్వేటినగరం, నగరి, పుంగనూరు, కుప్పం, పులిచెర్ల మండలాల్లో 52 గ్రామాల్లో నాటు సారా తయారీ, వినియోగం వున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు.

తిరుపతిరూరల్లో వెడెక్కిన

క్యాంప్ రాజకీయాలు

ఎంపిపి ఎన్నిక నేపథ్యంలో ఎంపిటిసిలను క్యాంప్‌కు తరలింపు

తిరుపతిరూరల్, మార్చి20 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలంలో ఎంపిపి, వైస్ ఎంపిపి ఎన్నిక నేపథ్యంలో క్యాంప్ రాజకీయాలు వేడెక్కాయి. ఈనెల 27 తిరుపతిరూరల్ మండల మండల ప్రజాపరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక జరగనున్న తరుణంలో మండలంలోని ఎంపిటిసి లను క్యాంప్‌లకు తరలించారు. తిరుపతిరూరల్ మండలంలో 40 మంది ఎంపిటిసి స్థానాలు ఉండగా శెట్టిపల్లి ఎంపిటిసి మినహా 39మంది ఎన్నుకున్నారు. అందులో పెరుమాళ్ళపలి ఎంపిటిసి-2 స్వాతంత్ర అభ్యర్థిగా ఎన్నిక కాగా మిగతా 38 ఎంపిటిసి స్థానాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. అందులో పెరుమాళ్ళపల్లి ఎంపిటిసి-1 స్థానానికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రాజీనామా చేయగా, సాయినగర్-2 ఎంపిటిసి శ్రీరాములురెడ్డి అకాల మృతి చెందడంతో ఆరెండు స్థానాలు ఖాళీలు ఏర్పడ్డాయి. పెరుమాళ్ళపల్లి ఎంపిటిసి-1గా ఎన్నికై తిరుపతిరూరల్ ఎంపిపిగా ఉన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆ పదవికి రాజీనామా చేయడంతో మండలాధ్యక్ష పదవి ఖాళీ ఏర్పడింది. మండల ఉపాధ్యక్ష రెండు పదవులకు తిరుచానూరు ఎంపిసిటిసి-6 వేముల యశోధ, పైడిపల్లి ఎంపిటిసి విడుదల మాధవరెడ్డిలను ఎంపిక చేసిన విషయం తెల్సిందే. ఎంపిపి పదవికి మోహిత్‌రెడ్డి రాజీనామ చేయడంతో 2024 జనవరి 4న ఉపాధ్యక్ష పదవిలో ఉన్న వేముల యశోధను ఇన్‌చార్జి ఎంపిపిగా నియమించారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఈనెల 27న ఎంపిపి, వైస్ ఎంపిపి లను ఎన్నుకోనున్నారు. దీంతో దాదాపు 30 ఎంపిటిసి సభ్యులను ముంబాయి, చెన్నై రిసార్ట్స్‌కు, షిర్డికి తీసుకెళ్ళనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎంపిపి ఎన్నికపై స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

ఎపిజెఎసి అమరావతి చిత్తూరు మహిళా విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో గురువారం మహిళా ఉద్యోగుల ఫిర్యాదు పెట్టెను ప్రారంభిస్తున్న కలెక్టర్, జెసిలు

కొండపైకి "బాలాజీ రిజర్వాయర్" పరిష్కారం!

-ప్రాజెక్టు నిర్మాణం ప్రస్తుత అవసరం



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల: రోజుకు లక్షమంది వరకు భక్తులు....అవసరాలకు తగ్గట్లు తాగునీటికి శాశ్వత పరిష్కారం కోసం తిరుమలకు "బాలాజీరిజర్వాయర్"తోనే పరిష్కారం లభిస్తుంది. ఈరిజర్వాయర్"నిర్మాణం గత ఐదేళ్ళలో ఎక్కడపనులు అక్కడే ఆగిపోయాయి.. వర్షాభావ పరిస్థితుల్లో కొండపై జలాశయాల్లో సరిపడే నీరులేకపోతోంది. గతంలో నీటిఎద్దడి 2015లోనూ తిరుమలలో ఎదుర్కొన్నారు. అలాగే నాలుగుసంవత్సరాల క్రిందట తిరుమలలో నీటి సమస్య ఎదురైనపుడు బాలాజీరిజర్వాయర్ నిర్మాణంపై 2018లో ప్రస్తుత (అప్పటి)ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మదిలో శ్రీకారం చుట్టింది. తిరుమలకు భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా, శాశ్వత పరిష్కారానికి ప్రత్యామ్నాయంగా బాలాజీరిజర్వాయర్ ప్రధానమని అప్పట్లోనే భావించారు. 1టిఎంసి నీటిని తిరుమల తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలనేది టిటిడి అధికారుల ఆలోచన. అందుకు తగ్గట్లు సుమారు 350కోట్ల రూపాయల అంచనాతో ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. ఈ పనులు 2018లోనే మొదలయ్యాయి. మళ్ళీ ఎక్కడిపనులు అక్కడ ఆగిపోయాయి. గత ఏడాది వరుసగా బలమైన వర్షాలతో తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాలు గోగర్భండ్యామ్, పాపవినాశనం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధారతీర్థాలు పూర్తిస్థాయి నీటిసామర్థ్యంతో ఉంటున్నాయి.

-"బాలాజీ"నీరే ఆధారం:

ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే తిరుపతికి సమీపంలోని రేణిగుంట మండలం కరకంబాడి గ్రామం వద్ద బాలాజీ రిజర్వాయర్‌ను చేపట్టాలని ప్రతిపాదనలు,ఆలోచన వచ్చింది. ఈ ఆలోచనతో ఈ రిజర్వాయర్ పనులు చేపట్టేందుకు శేషాచలం అటవీప్రాంతంలో రిజర్వుఫారెస్టు అనుమతులు అవసరమయ్యాయి. ఈ అనుమతులకోసం చాలాకాలం కేంద్రప్రభుత్వం నుంచి వేచిచూడాల్సి వచ్చింది. గత 2014లోని తెలుగుదేశం ప్రభుత్వంలోని పాలకమండలి బాలాజీరిజర్వాయర్ నిర్మాణానికి అనుమతులు తీసుకుని చేపట్టింది. అయితే పూర్తిస్థాయిలో పనులు మొదలుకాలేదు. కరకంబాడి వద్ద ఈ రిజర్వాయర్‌ను3.082 టిఎంసిల నీటిసామర్థ్యంతో నిర్మిస్తే 1 టిఎంసి తిరుమల తాగునీటి అవసరాలకు మరో 2 టిఎంసిల నీటిని మల్లెమడుగు ప్రాజెక్టుకు పంపి అటు తాగునీరు ఇటు 55వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే అవకాశం ఉంటుందని భావించారు. ఒకవేళ నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చినా ఈ రిజర్వాయర్ నుంచి మల్లిమడుగు మీదుగా కల్యాణిడ్యామ్‌కు తరలించి 35కిలోమీటర్లు మేర క్యాచ్‌మెంట్ ఉంటుందని, తిరుమలకు లక్షమందికిపైగా భక్తులు చేరినా, 1టిఎంసి నీరు నిల్వఉంటుందని, అవసరమైన సమయంలో పంపింగ్ చేసుకునేందుకు వీలుగా ఉంటుందని భావించారు. ప్రస్తుతం సిఎం చంద్రబాబునాయుడు ఈ రిజర్వాయర్‌పై టిటిడి బోర్డుకు తగిన ఆదేశాలిస్తే కార్యరూపం సాకారమవుతుంది.

అసెంబ్లీలో దళితులకు మాట్లాడే అవకాశం కల్పించిన ఘనత టిడిపి ప్రభుత్వందే

ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు, మార్చి 20, ప్రభాతవార్త తెలుగుదేశం పార్టీ హయాంలోని మాల మాదిగలకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కల్పించడం సంతోషదాయకమన్నారు. గురువారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అసెంబ్లీలో ఏ బి సి వర్గీకరణ పై మాట్లాడే అవకాశాన్ని కల్పించినందుకు ముందుగా స్పీకర్‌కి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ దళిత బంధువుడు దళిత దేవుడు అయినటువంటి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వల్ల ఈ రోజు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కలిగిందన్నారు ఏ బి వర్గీకరణ విషయంలో 1998 తెలుగుదేశం పార్టీ హయాంలో జస్టిస్ రామచంద్రన్ కమిషన్ ఆదేశాల మేరకు వర్గీకరణ బిల్లుని ఏప్రిల్ ఒకటో తేదీ 2000 సంవత్సరంలో పార్లమెంట్లో జీవో నెంబర్ 68 జారీ చేసి ఆమోదం పొందడం జరిగిందన్నారు. దీనిపై సుప్రీంకోర్టు వెళ్ళగా దీన్ని ఎవరు ఏం చేయలేరు పార్లమెంట్లో ఆమోదం బిల్లు అయిందని సుప్రీంకోర్టు చెప్పడం జరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని 2024లో ఎన్డీఏ కూటమి తెలంగాణలో ఎన్నికలకి వెళ్ళినప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగానే మన రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు మంత్రివర్గంలో బిల్లును ప్రవేశ పెట్టడం సంతోషదాయకమన్నారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాల ఏర్పాటుచేసిన ఏకైక ముఖ్యమంత్రి మన చంద్రబాబు నాయుడు అన్నారు దేవాలయాల్లో దళితులకు కమిటీలు గాను చైర్మన్గా అవకాశం కల్పించింది తెలుగుదేశం పార్టీ అదేవిధంగా విదేశీ విద్యను కూడా దళితులకు ప్రవేశపెట్టడం జరిగిందని గత వైసిపి ప్రభుత్వం లో జగన్మోహన్ రెడ్డి ఒక్క దళితుడిని కూడా విదేశాల్లో చదివించిన పాపాన పోలేదన్నారు దళితులకు సీలింగ్ కార్లు ట్రాక్టర్లు సబ్సిడీ ద్వారా ఇవ్వడమో దళిత తేజం పేరుతో దళితవాడను అభివృద్ధి చేయడం జరిగిందని విషయాన్ని దళితులు తెలుసుకోవాలన్నారు. మాదిగలు ఇప్పుడు ఎన్ని ఉద్యమాలు చేసినా వర్గీకరణలో బిల్లు మాత్రం చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టడం సంతోషదాయకమన్నారు. దళితులుగా ఉన్న జిఎంసి బాలయోగి, ప్రతిభా పటేల్‌ని స్పీకర్‌గా చేయడంతో పాటు రాష్ట్రపతిగా నారాయణను గతంలో పనిచేయడం జరిగిన విషయాన్ని కూడా మాల మాదిగలు గమనించాలన్నారు. అన్న నందమూరి తారక రామారావు దళితుల్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. చాలా మాదిగల అపోహాలు విడనాడలని 2026 ఎన్నికల్లో జనాభా ప్రతిపాదికన జిల్లా వర్గీకరణ చేపట్టాలన్నారు.

సంతూరు బాధితుల్ని ఆదుకోవాలి

– బహుజనసేన అధ్యక్షుడు శ్రీచందు ,– మండల కార్యాలయం ఎదుట నిరసన !!

శాంతిపురం, మార్చి 20 ప్రభాతవార్త

శాంతిపురం మండలం సంతూరు గ్రామంలో ఇటీవల నిరుపేదల గృహాలను అధికారులు తొలగించారని బాధిత కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బహుజన సేన అధ్యక్షుడు శ్రీచందు డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం మండల సచివాలయం ఎదుట బాధితులతో కలసి నిరసన కార్య క్రమం చేపట్టారు. వెంటనే గృహాలు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అగ్రకులాల వారు ఎక్కడా ప్రభుత్వ భూములు ఆక్రమించుకోలేదా అని ప్రశ్నిం చారు. ఇంతలోనే రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ అక్కడకు చేరుకుని విషయాన్ని తహశీల్దార్ శివయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీ ంతో తహశీల్దార్ మాట్లాడుతూ బాధితుల్లో ఇద్దరు నిరుపేదలు ఉన్నారని వారి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు పంపినట్లు చెప్పారు. వారికి ప్రభుత్వ స్థలంలో ఇళ్ల కట్టుకునేందుకు చర్యలు చేపడ్తామన్నారు. అయితే ఇందుకు శ్రీచందు అంగీకరించలేదు. ఇళ్లు కోల్పోయిన అందరికీ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహశీల్దార్ వారికి తెలపడంతో వెనుతిరిగారు. నియోజకవర్గ బహుజనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

రైతుల అభ్యున్నతికి సిఎం చంద్రబాబు కృషి

రామకుప్పం, మార్చి 20 ప్రభాతవార్త

రైతుల అభ్యున్నతికి సిఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలుగురైతు విభాగం నియోజకవర్గ అధ్ య క్షుడు చలపతి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌ను పట్టించుకోకపోగా మరలా సిఎం చంద్రబాబునాయుడు రైతులకు బిందుసేద్య పరికరాలు రాయితీతో అందిస్తున్నారన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి గోకులం షెడ్ల నిర్మాణాలను ప్రోత్సహించడంతో పాటు తాగు,సాగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి హంద్రీ–నీవా, గండికోట జలాలు తెచ్చేందుకు చొరవ చూపుతున్నారన్నారు. రైతులను అన్ని విధాలా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

ఎస్టీ కాలనీల్లో రక్తహీనత నిర్ధారణా పరీక్షలు

చౌడేపల్లి, మార్చి 20 ప్రభాతవార్త మండలంలోని ఎస్టీ కాలనీల్లో రక్తహీనత నిర్ధారణా పరీక్షలు నిర్వహించారు. స్థానిక గడ్డంవారిపల్లి రోడ్డులోని యానాది కాలనీలో వైద్యాధికారి పవన్‌కుమార్, లద్దిగం పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఎంపిహెచ్ఇఓ హరినాథ్‌ల అధ్వర్యంలో ఎస్టీల కాలనీల్లోని యానాదులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతకు చికిత్స లేదనీ, వ్యాధి సోకినవారికి ఎర్ర రక్తకణాలు అర్ధచంద్రాకారంలో వుంటాయన్నారు. జీవితాంతం రక్తమార్పిడి ఒక్కటే మార్గమన్నారు. వ్యాధి సోకినవారికి స్విమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా రక్తమార్పిడి చేస్తారనీ, ప్రభుత్వం ప్రతినెల ఫించను రూపంలో రూ. 10వేలందిస్తుందన్నారు. సూపర్‌వైజర్లు బాహుద్దీన్, రెడ్డెమ్మ, మంజుల, సుధాకర్, రమణ, రుక్మిణి, ఆశా కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు – నలురురిపై కేసులు నమోదు

గుడిపాల, మార్చి 20 ప్రభాతవార్త: గుడిపాల పోలీసులు గురువారం మండల పరిధిలోని పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి నలుగురు పేకాట నిర్వాహకులను అరెస్టు చేశారు. ఎస్ఐ రామ్మోహన్ వెల్లడించిన వివరాల మేరకు మండల పరిధిలో శ్రీరం గంపల్లిలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమా చారం అందిందని, ఈ మేరకు తాను సిబ్బందితో కలిసి దాడులు నిర్వహిస్తే ఆ దాడుల్లో 12,100 రూపాయల నగదుతో పాటు పేకాట ఆడుతున్న శరవణ, రాజేంద్ర, పృధ్వీ, సురేష్‌బాబులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న పలువురు అక్కడి నుండి పారిపోయారని వారిని సైతం త్వరలో పట్టుకుంటామన్నారు.

ఆశా వర్కర్లు విధులకు యూనిఫాంతో హాజరు

– డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త: క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే ప్రతి ఆశా వర్కర్ విధులకు యూనిఫాంతో హాజరు కావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి ఆశా వర్కర్లకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం చేపట్టే ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాల్లో ఆశా వర్కర్ల పాత్ర కీలకం కావడంతో ప్రతి ఒక్క ఆశా వర్కర్ క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే సమయంలో యూనిఫాంతో హాజరు కావాలని స్పష్టం చేశారు.డిఐఓ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అనిల్, జయరాముడు, మూర్తి పాల్గొన్నారు.

పోషణ్‌భీ-పడాయిభీతో పిల్లల్లో పెరుగదల : ఐసిడిఎస్

చౌడేపల్లి, మార్చి 20 ప్రభాతవార్త పుట్టినప్పటి నుంచి 3యేళ్ళ వరకు పెరుగుదలకు ఎలాంటి పోషక విలువలు గల పదార్థాలందించే కార్యక్రమమే పోషణ్‌భీ–పడాయిభీ ఉద్ధేశ్య మని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సులోచనా, రమాదేవిలన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణంలో నవచేతన, ఆదర్శశీల కార్యక్రమాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు 3రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. పథకాల యొక్క ఉద్ధేశ్యాన్ని వారికి వివరించారు. మండలంలోని 66అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ భవనానికి తాళం వేసిన ఉపసర్పంచ్

యర్రావారిపాలెం, మార్చి 20, ప్రభాతవార్త:

భవన నిర్మాణానికి ఖర్చు చేసిన నిధులు ఇంకా తనకు రాలేదని ఉపసర్పంచ్ సచివాలయ కార్యాలయానికి తాళాలు వేసిన సంఘటన యర్రావారిపాలెం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉపసర్పంచ్ హేమంత్ కుమార్ మేదరపల్లి కాలనీలోని రోడ్ల విషయంపై పంచాయతీ కార్యదర్శి మేనక దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్లు వేయకముందునే పైపులైన్లు వేస్తే బాగుంటుంది అని కోరారు. దీంతో పంచాయతీ కార్యదర్శి తనని ఎవరని, తనకు అడగడానికి హక్కు లేదని తెలిపింది. దీనికి తోడు 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. వాటిని ఎలా ఖర్చు చేస్తారో వార్డు సభ్యులందరికీ మాట్లాడి ఆ నిధులను వినియోగిస్తే బాగుంటుందని అడుగుగా దానికి కూడా నీకెందుకు చెప్పాలి అని దురుసుగా మాట్లాడిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉప సర్పంచ్ అని గౌరవం కూడా ఇవ్వకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడడం సబబు కాదని అన్నారు. అయితే గత ప్రభుత్వంలో యర్రావారి పాలెం మండలం, యర్రావారి పాలెం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ సచివాలయ భవనాన్ని నిర్మించారు. ఇప్పటి వరకు భవన నిర్మాణానికి సంబంధించిన డబ్బు తనకు రాకపోవడంతో ఆవేదన చెందిన అతను సచివాలయ భవనానికి తాళాలు వేశారు. తన డబ్బు తనకు చెల్లిస్తే తాళాలు తీస్తానని తెలిపారు. దీంతో ఉప సర్పంచ్ సచివాలయ నిర్మాణానికి మొత్తం నిధులను నేనే ఖర్చు చేశానని.. చేసిన ఖర్చు వెనక్కి తిరిగి ఇస్తే సచివాలయ భవనాన్ని తాళాలు తీస్తానని తెలిపారు.

సిఎం చంద్రబాబును కలసిన ఆర్యవైశ్య సంఘ నేత గిరిధర్‌బాబు

కుప్పం,మార్చి 20 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునా యుడును ఆర్యవైశ్య సంఘం యువనేత గిరిధర్‌బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండ వల్లిలోని సిఎం నివాసంలో ఆయన సిఎంను కలి శారు. ఈసందర్భంగా కుప్పం పాతపేటలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేకం ఈనెల 21-24 తేదీల్లో జరుగుతుందని ఈ ఉత్సవాలకు హాజరు కావాలని ఆర్యవైశ్య సంఘం తరపున గిరిధర్‌బాబు ముఖ్యమంత్రిని ఆహ్వానించి పత్రికను అందజేశారు.

పోషణ్‌భీ.. పడాయిభీపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త

స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్య కర్తలకు పోషణ్‌భీ, పడాయిభీ అనే కార్యక్రమంపై సిడిపిఓ కృష్ణవేణి అధ్ వ్యర్యంలో మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈసందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఆదేశాల మేరకు మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుగుతోందన్నారు. వీటిని విధిగా వారికి అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. అలాగే మహిళలు విద్యపై ఆసక్తి చూపేలా వారికి అక్షరాస్యత కల్పించాలని సూచించారు. మూడుఏళ్లలోపు పిల్లలకు నవచేతన కార్యక్రమం, 3–6ఏళ్ల పిల్లలకు ఆదర్శిల కార్యక్రమంలో గురించి తొలిరోజు టివిలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపరవైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల క్యాంప్ కరపత్రాలు ఆవిష్కరణ

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త

కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఈనెల 21,22 తేదీల్లో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంల సూచనలతో నిర్వహించే విభిన్న ప్రతిభావంతుల క్యాంప్ కరపత్రాలను గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు ఎంఆర్ సురేష్, సోమశేఖర్‌లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఈనెల 22వతేది కుప్పం మున్సిపల్ పరిధిలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు ఈ శిబిరంకు తగు పత్రాలతో హాజరు కావాలని కోరారు.

చెత్తసంపద తయారీ కేంద్రానికి ఫెన్సింగ్ ఏర్పాటు

కుప్పంరూరల్, మార్చి 20 ప్రభాతవార్త

మండలంలోని కొటాలూరు పంచాయతీలో స్వచ్ఛా ంధ్ర కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి స ంపద తయారీ కేంద్రానికి సర్పంచ్ రాజేం ద్రన్ అధ్వర్యంలో గురువారం ఫెన్సింగ్ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజల ఇళ్ల నుంచి చెత్త సేకరణకు ప్రభుత్వం తరపున బుట్టలు పంపిణీ చేయడంతో పాటు ఇళ్లనుంచే చెత్తను నేరుగా సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరాజులునాయుడు, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు పొన్నువేలు, పంచాయతీ కార్యదర్శి మంజునాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలకు చెత్త సేకరణకై బుట్టలు పంపిణీ

కుప్పంరూరల్, మార్చి 20 ప్రభాతవార్త

మండలంలోని చెక్కునత్తం పంచాయతీలో చెత్త సేకరణకు గాను మహిళలకు ప్రభుత్వం తరపున చెత్త సేకరణ బుట్టలను రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి అధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈనెల 21న కుప్పంలో జరిగే సదరం క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, విఆర్వో మహేష్, నేతలు మునిరత్నం ఆచారి, దేవేంద్ర, బాలు,వెంకటాచల ం, బీరప్ప, రాము పాల్గొన్నారు.

కస్తూరిబా గురుకులంలో అడ్మిషన్లకు దరఖాస్తులు

రామకుప్పం, మార్చి 20 ప్రభాతవార్త

మండలంలోని విజలాపురం కస్తూరిబా గురుకులంలో ఆరవ తరగతి, ఇంటర్ ఫస్టియర్ కోర్సుల్లో ప్రవేశా లకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అమరావతి కోరారు. ఈనెల 22వతేదినుంచి ఏప్రిల్ 11వతేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పలమనేరు బార్ కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షులుగా భాస్కర్ ఏకగ్రీవం

పలమనేరు,మార్చి 20,ప్రభాతవార్త:

పలమనేరు బార్ కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎల్.భాస్కర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.పలమనేరు నూతన కోర్టు భవనం ఆవరణలో గురువారం ఎన్నికల అధికారి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహిం చారు.ఈ మేరకు పలమనేరు బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా లక్ష్మీపతి, అధ్యక్షులుగా ఎల్.భాస్కర్,ఉపాధ్యాక్షులుగా చంద్రశేఖర్,షరీఫ్,జనరల్ సెక్రెటరీగా బర్కత్,జాయింట్ సెక్రటరీగా రవి,ట్రెజరర్‌గా ఫామిద్ బాషా,లైబ్రేరియన్‌గా ఇబ్రహిం,లేడీ రిప్రజెంటేటివ్‌గా మహేశ్వరి,స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా రంజిత్ షాను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకోవడంతో ఎన్నికల అధికారి నారాయణరెడ్డి వారిని ప్రకటించారు.

హోరా హోరీగా సంత వేలం పాట

శ్రీరంగరాజపురం, మార్చి 20 ప్రభాతవార్త: శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లిమిట్ట మేజర్ పంచాయతీ వారపు సంత వేలం పాటు గురువారం అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైకాపా నాయకుల మధ్య హోరా హోరీగా సాగింది. కొత్తపల్లిమిట్ట గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం పంచాయతీ అధికారులు సంత వేలం పాటను పోలీసుల బందోబస్తుతో నిర్వహించారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సంత వేలం పాటను వైకాపాకు చెందిన స్కైలా జయచంద్రారెడ్డి 1,15,000 రూపాయలకు పాట పాడి సంత వేలంను దక్కించుకున్నారు. గత ఏడాది ఈ సంత వేతం రూ.5.30 లక్షలకు వేలం పాట పాడుగా అంతకు ముందు ఏడాది 1.16 లక్షల రూపాయలు మాత్రమే సంత వేలం పాట పాడారు. ఇరు పార్టీలు సంత వేలంను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో వేలం పాటలో ఘర్షణలు జరిగే అవకాశం వుందని పోలీసులు ముందుగానే జాగ్రత్తలు తీసుకుని గట్టి బందోస్తును ఏర్పాటు చేశారు. ఈ వేలం పాటలో 30 మంది పాల్గొనగా స్కైలా జయచంద్రారెడ్డి వేలం పాటను అత్యధికంగా పాడి దక్కించుకున్నారు. సంత వేలం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కార్వేటినగరం సిఐ హనుమంతప్ప, వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి బాలరాజు సంత వేలం దక్కించుకున్న స్కైలా జయచంద్రారెడ్డికి వేలం హక్కు పత్రాలను అందజేశారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు నిబంధనల్ని పాటించాలి

– సీఐ కృష్ణమోహన్

పూతలపట్టు, మార్చి 20 ప్రభాతవార్త

రాష్ట్రంలో రహదారులపై వాహనాలు నడిపే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు,లారీలు, నడిపేవారు లైసెన్స్ ఇన్సూరెన్స్ ఆర్సి హెల్మెట్ ఇతర వాహనాలు నడిపే డ్రైవర్లపై మోటారు వాహన చట్టం ప్రకారం కఠినంగా చర్యలు సీఐ కృష్ణమోహన్ ఉంటాయన్నారు. నిబంధనల పాటించకపోతే భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే వారితో పాటు వెనుక సీట్లో కూర్చొన్న వారికి సైతం వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధిస్తారు. ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే మొదటిసారి 2 వేలు, రెండోసారి 4 వేలు జరిమానా విధిస్తారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే 5 వేలు జరిమానా కట్టాల్సి ఉంటుంది. పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోతే 1500 జరిమానా ఉంటుంది. వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వాడితే తొలిసారి 1500, రెండోసారి 10 వేలు జరిమానా విధిస్తా రు.ఆటోవాలాలు యూనిఫాం లేకుండా వాహనం నడిపితే తొలిసారి 150, రెండోసారి 300 జరిమానా విధిస్తారు. వాహనాలు రిజిస్ట్రేషన్ లేకుండా, ఫిట్ నెస్ సర్టిఫికెట్ లేకుండా, రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించుకోకుండా నడిపితే తొలిసారి 2 వేలు, రెండోసారి 5 వేలు జరిమానా విధిస్తారని సిఐ తెలిపారు.

సమన్వయ సహకారంతో శ్రీ గంగమ్మజాతర : ఎస్ఐ

పుంగనూరు రూరల్, మార్చి 20, ప్రభాతవార్త

అందరి సహకారంతోనే పుంగనూరులో ఈనెల 25 26 తేదీల్లో గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించు కుందామని, అందరూ కలిసి రావాలని ఎస్ఐ లోకేష్ పిలుపునిచ్చారు. గురువారం పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో జరిగిన అన్ని మతాలకు చెందిన పీస్ కమిటీ సభ్యులు మాట్లాడారు. ఇసుగు టూరు గంగ మ్మ జాతర వందల ఏళ్లుగా జరుగుతున్న వైభవానికి నిదర్శనమని ఇదే జాతరకు అనేక మతాల ప్రజలు వ్యాపారాలు కూడా చేసుకుంటారన్నారు. గంగమ్మ జాతర సందర్భంగా ఎటువంటి అసౌకర్యాలు అవాం ఛనీయ సంఘటనలు జరగడానికి వీలులేదని హెచ్చరించారు. పీస్ కమిటీ సమావేశంలో పాల్గొన్న హైందవ సంఘ నాయకుడు త్రిమూర్తి రెడ్డి మాట్లాడుతూ పుంగనూరులో మతాలు ఏర్పడక ముందే సుగుటూరు గంగమ్మ ఆలయం ఉందని, గంగమ్మ జాతర నిర్వహణకు ఎటువంటి మతాల ప్రసక్తి అడ్డు ఉండకూడదని పేర్కొన్నారు. ముస్లిం సంఘ నాయకులు మాట్లాడుతూ ఇది అందరి జాతర అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, పలు మతాల ప్రజలు పాల్గొన్నారు.

30న కాణిపాకం ఆలయంలో ఉగాది వేడుకలు

కాణిపాకం, మార్చి 20 ప్రభాతవార్త:

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలను ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం ఆలయంలో ఈనెల 30న అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, చందనాలంకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలోని అలంకార మండపం కళ్యాణ వేదిక వద్ద దేవస్థానం అర్చకులు, వేదపండితులు, పురోహితుల సమక్షంలో ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు పంచాంగ శ్రవణమును కార్యక్రమంను నిర వ్హించనున్నట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నందు జరుగు ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు ఎద్దవత్తున పాల్గొని ఉగాది పచ్చడిని స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

శ్రీవీరాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ రాతి పనులు ప్రారంభం

కాణిపాకం, మార్చి 20 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేమైన కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీవీ రాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సంభం దించి రాతి కట్టడం పనులను గురువారం ప్రారంభిం చారు.నుమారు1.10కోట్లరూ పాయలవ్యయ అంచ నాలలో దాత అమెరికాకు చెందిన ప్రవాసాంధ్రుడు మల్లవరపు అనిల్ రాతి కట్టడంతో నూతన శ్రీవీరాంజనేయస్వామి ఆలయాన్ని పునర్నిర్మించనున్నారు. ఇందులో భాగంగా ఆలయాన్ని తొలగించి గత నెల 17న ఆలయ పునరి న్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈమేరకు బెస్‌మెంట్ పనులు పూర్తి కావడంతో రాతి వర్గాల పనులకు గురువారం ఆలయ అధికారులు ప్రత్యేకపూజలు చేసి ప్రారంభించారు.ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరిండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, ఏఈ శివాంజనే యులు, అర్చకులు వేదపండితులు పాల్గొన్నారు.

అరగొండ గ్రామ పంచాయతీకి 20.35 లక్షలు ఆదాయం

తవణంపల్లె, మార్చి 20 ప్రభాతవార్త:

మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అరగొండ గ్రామపంచాయతీలో గురువారం నిర్వహించిన వేలం పాటల ద్వారా ఆదాయంగా సమకూరింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంభందించి అరగొండ గ్రామపంచాయతీ వివిధ లీజు హక్కుల కోసం గ్రామ సర్పంచ్ టి.మల్లుదొరై, కార్యదర్శి కె.మురుగేశన్‌ల ఆధ్వర్యంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం పాటలను నిర్వహించారు.ఈసందర్భంగా పంచాయతీ పరిధిలోని వారపు సంత రుసుము వసూలు లీజు హక్కు ద్వారా 7.95 లక్షలు, దినసరి మార్కెట్ రుసుము వసూలు లీజుహక్కు వేలం ద్వారా 4,25 లక్షలు ఆదాయంగా సమకూరింది. అలాగే కొత్తబస్టాండులోని పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ ఆరుగదులకు ఒక ఏడాదికి లీజు హక్కుల ద్వారా 8.15 లక్షలు రూపాయలు ఆదాయంగా వచ్చింది. ఈవేలం పాటలలో ఈఓపీఆర్డీ రాజేంద్రరాజు, వ్యాపారస్తులు పాల్గొనా ్నరు.

కుప్పంలో నేడు..రేపు సదరం క్యాంప్‌లు

– కడ పి.డి. వికాస్ మర్మత్



కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శుక్ర,శనివారాల్లో కుప్పం ఏరియా ఆస్పత్రిలో విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సదరం క్యాంప్‌లు ఏర్పాటుచేసినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన వారికి మార్చి 21వతేది, కుప్పం మున్సిపల్, గ్రామీణ మండలాలకు సంబంధించి మార్చి 22న ఈ క్యాంప్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్యాంపులో పాల్గొనే ప్రత్యేక ప్రతిభావంతులు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా వైద్య శిబిరంకు హాజరై పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. సదరం సర్టిఫికెట్ పొందాలనుకున్న వారు తప్పక తమ ఆధార్ కార్డు ఒరిజినల్, గతంలో ఆస్పత్రిలో ఇచ్చిన రిపోర్ట్‌లు, తెల్లరేషన్‌కార్డులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు నాలుగు తమ వెంట తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమం

కల్లూరు, మార్చి 20, ప్రభాతవార్త

పులిచెర్ల మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు ఈ నెల 20వ తేది నుండి 22వ తేది వరకు మూడు రోజుల పాటు పోషణ్ భీ పడాయి భీ శిక్షణా కార్యక్రమం జడ్పిహెచ్ఎస్ పులిచెర్లలో ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరి సూచనలతో సూపర్‌వైజర్స్ విజయలక్ష్మి, రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పోషణ్ భీ పడాయి భీ అనేది సాక్షం అంగన్‌వాడి, మిషన్ పోషణ్ 2.0 క్రింద ఒక కార్యక్రమం జాతీయ విద్యా విదానం 2020 కింద గుర్తించి పిల్లల అభివృద్ధికి డొమైన్‌లో శారీరక అభివృద్ధులతో వారి నైపుణ్యాలను పెంపొందించడంపై ఆరు సంవత్సరాల తక్కువ వయస్సు వున్న పిల్లలందరికి సమగ్రాభివృద్ధిని అంగన్వాడిలో బాల్య విద్యా నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో పోషణ్ బీ పడాయి బీ ప్రారంభించబడిందన్నారు. అంగన్‌వాడి కార్యకర్తలతో ఆదర్శశీ నవ చైతన్యం పోషణ ట్రాకర్, ఫీడింగ్ పద్ధతులు, పోషకలోపాలలో సహా పోషకాహారం పై అవగాహనను బలోపేతం చేయడం ఈ శిక్షణ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు.ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, ఎంపిడిఓ రాజ శేఖర్, హెచ్ఎం సయ్యద్, టీచర్స్ వెంకటశివ, సయ్యద్ భాష, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సిబ్బంది బదిలీలు..

పెద్దపంజాణి, మార్చి 20 ప్రభాతవార్త:

పెద్దపంజాణి మండలంలో పనిచేస్తున్న పలువురు ఉపాధిహామీ సిబ్బంది ఇతరప్రాంతాలకు బదిలీఅయ్యారు.జూనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నాగమణి సోమల మండలానికి బదిలీఅయ్యారు.అలాగే టిఏలుగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి,దేవేంద్ర గంగవరం,శాంతిపురం మండలాలకు బదిలీ అయ్య

తిరుపతి డివిజన్

భాస్కర్‌రాజుకి సంస్మరణ సభ

పుత్తూరురూరల్, మార్చి 20 ప్రభాతవార్త: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం, హక్కుల కోసం నిరంతరం కృషి చేసిన భాస్కర్‌రాజు చిరస్మరణీయుడని అన్నారు. స్వర్గీయ బసవరాజు భాస్కర్‌రాజు సంస్మరణ దినోత్సవం సభకు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గుణశేఖర్‌రెడ్డి అధ్యక్షతన వహిస్తూ ఎందరో దాతలను సంప్రదించి శ్రమించి నిధులను సమీకరించి నిర్మించిన ఈ విశ్రాంత భవనంలోని ప్రతి ఇటుక ఆయనను స్మరిస్తుందన్నారు. సమావేశానికి విశిష్ట అతిథులుగా విచ్చేసిన మాజీ మండల అధ్యక్షులు ఏళుమలై, భవన నిర్మాణ సమయంలో ఒక్కరే వచ్చి నిర్మాణాన్ని పూర్తి చేసిన రాజును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ జీవరత్నంనాయుడు, రాష్ట్ర బాధ్యతలు గురురాజా రావు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఉపాధ్యాయ ఉద్యమ యోధుడిగా ఎదిగిన భాస్కర్‌రాజు మాకు సంస్మరణ సభ జరిపవలసింది పోయి అతనికే సంతాప దినం జరపడం శోచనీయం అన్నారు. యుగంధర్ జిల్లా బాధ్యులు మాట్లాడుడూ భాస్కర్‌రాజు ఎన్నో సాహిత్య, సాంస్కృతిక సభలను ఇదే వేదిక మీద ఏర్పాటు చేసి అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రాజు భార్య చూడామణి, కుమారులు చైతన్య, ఉప ఖజనాధికారి సెల్వ రాజ్, సిబ్బంది, డా. రవిరాజు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కిరణ్, విశ్రాంతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర బాధ్యులు జయరాం నాయుడు, కృపావరమ్మ, జిల్లా బాధ్యులు శంకర్, సిద్ధయ్య, రవిశంకర్, మండల బాధ్యులు కుప్పయ్య, రామలింగం, చంద్రశేఖర్ వర్మ, అరుణాచలం, బాలసుబ్రహ్మణ్యం, లోకేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక రంజాన్

తిరుపతి హెల్త్, మార్చి 20 ప్రభాతవార్త ః రాష్ట్రీయ సేవా సమితి (రాస్) మహిళా పొదుపు సంఘాల గౌరవర్థాం రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యాలయంలో మందుస్తు రంజాన్ వేడుకలు (ఇఫ్తార్ విందు) అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కెనరాబ్యాంకు చీఫ్ మేనేజర్ ఉమాపతి హాజరై మాట్లాడారు. భక్తి శ్రద్ధలకు ఉపవాస దీక్షకు ప్రతీక రంజాన్ పండుగ అని తెలిపారు. ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కెనరాబ్యాంకు ఆఫీసర్ రియాజ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా రాస్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో దాదాపు 150 మంది సంఘం సభ్యులు, రాస్ సిబ్బంది వాణి, కరుణాకర్, బాలాజీ, సత్యనారాయణ చౌదరి, నాగరాజు, రామాంజనేయులు, మునిరాజ, తదితరులు పాల్గొన్నారు.

స్టార్ట్ అప్ గ్రోత్ స్ట్రాటజీస్‌పై సెమినార్

తిరుపతి విద్య మార్చి 20 ప్రభాతవార్త

పద్మావతి వర్సిటీ ఎస్ఎస్ఐఈ టీబీఐ సెంటర్ ఆధ్వర్యంలో ఎనీ బ్లింగ్ పార్ట్నర్ ఆఫ్ జెనిసిస్ ఎంఎస్ హెచ్ పథకంలో భాగంగా ఐడియా టు ఐకాన్ స్టార్ట్ అప్ గ్రోత్ స్ట్రాటజీస్ అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. సెమినార్లో హైదరాబాద్లోని ఫినామిక్స్ క్యాపిటల్ మేనేజింగ్ పార్ట్నర్ అండ్ సీఈవో డాక్టర్ వడ్డీ సత్యనారాయణ పాల్గొని వాట్ మేక్స్ స్టార్టప్ ఫండబుల్ అను అంశంపై ప్రసంగించారు. ఆర్థిక అక్షరాస్యత యొక్క ప్రాముఖ్యతను ఆయన వివరించారు. స్టార్టపు అవసరమైన పిచ్ డెక్, ఫైనాన్షియల్ మోడల్, బిజినెస్ ఎంఐఎస్, వాల్యుయేషన్ డ్యూడిలిజెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. ఏసీ ప్రొఫెసర్ ఉమ సెమినార్లో పాల్గొని జెనిసిస్ పథకం కింద ఎంపిక చేయబడిన స్టార్టప్లకు గ్రాంట్ ఒప్పంద పత్రాలను అందజేశారు. ఈ సెమినార్లో హైదరాబాద్ జెన్ బయోసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, సీఈవో అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పాలడుగు నాగేశ్వరరావు, రిజిస్ట్రార్ రజిని, టీబీఐ సీఈవో డాక్టర్ జె సూర్యకుమార్, స్టార్ట్ అప్స్ ఇన్నోవేటర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీలలో ఎస్‌జిఎస్ విద్యార్థులకు బహుమతులు

తిరుపతి విద్య, మార్చి 20 ప్రభాతవార్త శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు గీతా ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించబడిన భగవద్గీత వ్రాత పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలిచి ద్వితీయ, తృతీయ బహుమతులను మరియు కన్సోలేషన్ బహుమతులను పొందారని కళాశాల ప్రిన్సిపల్ డా. బి. బి. సత్యనారాయణ తెలిపారు. గీతా ప్రచార సమితి వారు రాష్ట్రస్థాయిలో భగవద్గీత ను ప్రచారం చేయడానికి, భగవద్గీత యొక్క ఔన్నత్యాన్ని పిల్లలందరికీ తెలియజేయాలానే సత్సంకల్పంతో భగవద్గీత లోని 700 శ్లోకాలలో ప్రత్యేకించి 100 శ్లోకాలను ఒక పుస్తకంగా తయారు చేసి రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కళాశాలకు వెళ్లి విద్యార్థులకు ఆ పుస్తకమును ఇచ్చి, అందులోని 100 శ్లోకాలు, ఆ శ్లోకాలకు భావములు వ్రాయవలెనని పోటీలను 1000 మార్కులకు వ్రాత పోటీ పరీక్షలను 06022025 న తిరుపతిలోని ఎస్ వి. ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలలో శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న బి. హేమంత్ కుమార్ ద్వితీయ బహుమతిగా 15 వేల రూపాయలను క్యాష్ బహుమతిగాను, కే. అనూష తృతీయ బహుమతిని 12 వేల రూపాయలను, రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సి హెచ్. పల్లవి, కే. శ్రీనివాసులు, బి. సతీష్ నాయక్ లు 2116/ క్యాష్ బహుమతులను కన్సోలేషన్ బహుమతులుగా పొందారు. అత్యంత విలువైన బహుమతులను పొందడానికి మమ్మల్ని అనేక విధాలుగా ప్రోత్సహించిన సంస్కృతం అధ్యాపకుడు డా. కే కోటీశ్వరయ్యను, తెలుగు విభాగాధిపతి డా. యం. మాదన్న ని, అధ్యాపకులు డా. ఎ. కొండలరావుని, డా. పి. శివకుమార్ ని, డా. ఎస్. వసంతకుమారిని, కళాశాలలోని ఇతర అధ్యాపకులను ఎన్నటికీ మరువలేమన్నారు.

వైష్ణవకోనేరు పరిసరాల్లో ఓపెన్ బూజింగ్

.శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త తిరుపతి జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు పట్టణంలోని జయరామరావువీధిలోని వైష్ణవకోనేరు పరిసర ప్రాంతాల్లో ఓపెన్ బూజింగ్ జరుగుతున్నట్లు అర్బన్ సిఐ డి. గోపి తెలిపారు. గురువారం వైష్ణవకోనేరు పరిసర ప్రాంతాల్లో ఓపెన్ బూజింగ్ జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం నిమిత్తం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. మరియు హెచ్చరిక బోర్డులు కూడా పెట్టినట్లు సిఐ తెలిపారు. కోనేరు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా కూడా మద్యం సేవించడం చేయరాదని తెలిపారు. రాత్రివేళల్లో కూడా ఎవ్వరు కోనేరు పరిసర ప్రాంతాల్లో రాకుండా చర్యలుతీసుకుంటామని సిఐ తెలిపారు. అంతేకాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో అర్బన్ సిఐతో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

శివయ్య సన్నిధిలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు

శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్సి పివిఎన్ మాధవ్‌కు రాష్ట్ర కార్యదర్శి కోలా. ఆనంద్ ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో వెలసిన స్వామిఅమ్మ వార్లను దర్శించుకున్న అనంతరం మాధవ్ కుటుంబ సభ్యులకు రాష్ట్ర కార్యదర్శి మరియు కార్యకర్తలు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులచే ఆశీర్వాదం, స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు.

కొన్నలి రీసర్వేకు నోడల్ అధికారి ప్రశంసలు

-మండల సర్వేయర్‌కు అభినందనలు

.తొట్టంబేడు, మార్చి 20 ప్రభాతవార్త తిరుపతి జిల్లాలోని వివిధ మండలాల్లో జరుగుతున్న రీ సర్వే పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో పనులపై పది మంది ఉన్నతాధికారులను పరిశీలనకు నియమించారు. కొన్నలి గ్రామంలో జరుగుతున్న రీసర్వేకు సంబందించి టి. ప్రసాంతి బాయ్, అసిస్టెంట్ డైరెక్టర్ (హెడ్ క్వార్టర్స్) మండల సర్వేయర్ హరనాధ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి గ్రామంలో మొత్తం భూమి ఎంత ఉంది ఇందులో పట్టాభూములు ఎన్ని, డికెటి భూములు ఎంత ఉన్నాయి, ప్రభుత్వ భూములు ఎంత ఉన్నాయో తెలుసుకున్నారు. సర్వేయర్ చెప్పిన సమాధానానికి సంతృప్తి పడిన అసిస్టెంట్ డైరెక్టర్ ప్రశాంతిబాయ్ మండల సర్వేయర్ హరనాధ్‌ను అభినందించారు. కొన్నలి గ్రామంలో 529.06 ఎకరాలు ఉందని మండల సర్వేయర్ హరనాధ్ ఉన్నతాధికారికి వివరించారు. ప్రభుత్వ భూములు సర్వేనంబర్ 40లో84.82. ఎకరాలు, ఇరిగేషన్ ల్యాండ్స్ సర్వేనంబర్ 12లో 84.93 ఎకరాలు, డికెటి పట్టాలు 58.59 ఎకరాలు, ప్రైవేటు ల్యాండ్స్ 292.45 ఎకరాలు, గ్రామ కంఠం భూములు 8.27 ఎకరాలు ఉన్నాయని వివరించారు. అయితే రైతులకు గొలుసు ద్వారా గతంలో సర్వేచేసేవారని అయితే మారుతున్న కాలాన్ని బట్టి కంప్యూటర్ యుగంలో రోవర్ ద్వారా సర్వేనిర్వహిస్తే చక్కగా త్వరగా సర్వేపనులు పూర్తవుతాయని ఆమె తెలిపారు. సచివాలయ కొన్నలి గ్రామంలో శరవేగంగా రీసర్వేపూర్తిచేయాలని నోడల్ అధికారి ఆదేశించారు. సర్వేయర్లు కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వెళ్ళి పరిశీలన జరిపి సర్వేను నిర్వహించాలని ఆమె ఆదేశించారు. అన్నదాతలకు బ్యాంకు లోన్లకు ఇబ్బంది కలగకుండా ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని అందుకే ఖచ్చితమైన సర్వేను చేపట్టాలన్నారు. ఇటీవల బోనుపల్లిలో పలు సమస్యలు వచ్చినట్లు గుర్తించామని వివరించారు. వీటన్నింటిని పరిష్కరించాని ఆమె ఆదేశించారు. కొన్నలి గ్రామంలో జరుగుతున్న రీసర్వే గురించి పూర్తి సమాచారం సేకరించిన అనంతరం మండల సర్వేయర్ హరనాధ్, సచివాలయ సర్వేయర్లు విజయ్‌లోకేష్, తదితరులను నోడల్ అధికారి అభినందించడంతో పాటు అనంతరం పలుసూచనలు సలహాలు ఇచ్చారు. ఇందులో భాగంగా మండలంలో 10మంది నోడల్ అధికారులను నియమించి రీసర్వే గ్రామాల్లో ఎలా జరుగుతోందో తెలుసుకున్నారు. టి. ప్రసాంతి బాయ్, అసిస్టెంట్ డైరెక్టర్ (హెడ్ క్వార్టర్స్) తొట్టంబేడు మండలంలోని కొన్నలి గ్రామంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించేందుకు నియమించారు. తిరుపతి జిల్లాలో మరో తొమ్మిది మంది నోడల్ అధికారులను నియమించారు.

రేషన్ కావాలంటే...ఇకెవైసి తప్పనిసరి :తహశీల్దార్

తిరుపతిరూరల్, మార్చి 20 ప్రభాతవార్త: ఎప్రిల్ నెలలో రేషన్ పొందాలంటే ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని తిరుపతిరూరల్ తహశీల్దార్ బి. రామాంజులనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇకెవైసి ఇప్పటివరకు చేయించుకోకపోతే ఎప్రిల్ నెలలో రేషన్ పొందటానికి అనర్హులని తెలిపారు. పౌర సరఫరాశాఖ ద్వారా ప్రజా పంఫిణిలో పారదర్శకత కోసం జాతీయ సమాచార సంస్థ (ఎన్ఐసి) ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్‌ను నవీకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఇకెవైసి లేకున్నా రేషన్ లబ్దిదారులకు సరుకులు ఇచ్చేవారని, ఇకపై ఇకెవైసి చేయించుకోకపోతే రేషన్ సరుకులు ఇవ్వరని తెలిపారు.

తనపల్లి ఇందిరమ్మ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

-రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని రేషన్‌కార్డులతో ధర్నా

తిరుపతిరూరల్, మార్చి20 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం తనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేసారు. గురువారం తిరుపతిరూరల్ తహశీల్దార్ ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా నాయకులు ఎస్. జయచంద్ర మాట్లాడుతూ తనపల్లి ఇందిరమ్మ కాలనీలో అనేక సమస్యలు నెలకుని ఉన్నాయని, ప్రజా సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రధానంగా ప్రభుత్వం నగరములో ఇళ్లులేని పేదలక ఇక్కడ ఇళ్లు కేటాయించారు గానీ ఎలాంటి మౌళిక సదుపాయాలు కేటాయించలేదన్నారు. కాలనీలో దాదాపు 800 ఇండ్లలో కాపురం ఉంటున్నారన్నారు. కాలనీలో మౌళిక సదుపాయాలతో పాటు రేషన్ షాపు లేనందున లబ్దిదారులకు సక్రమంగా రేషన్ సరుకులు పొందలేకపోతున్నారని తెలిపారు. ఇందిరమ్మ కాలనీలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసారు. ఈ ధర్నా సిపిఐ జిల్లా నాయకులు సాయి లక్ష్మీ, నరేంద్ర, మునిరాజ్, చిరంజీవి, యుగంధర్, మధు, గణేష్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ కళాశాలలను విసి ఆకస్మిక తనిఖీ

తిరుపతి విద్య, మార్చి 20 ప్రభాత వార్త శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కేకేసి విద్యా సంస్థ కళాశాల లను వర్సిటీ ఉప కులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ విద్యా సంస్థ పరిధిలో ఎంబీఏ, లా, బిఈడి కళాశాలలో ఎస్వియు యూనివర్సిటీకి అనుబంధంగా నిర్వహిస్తున్నారు. అదే సమయంలో హోమియోపతి, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలలను కూడా అదే సమదాయంలో నిర్వహించడం తనిఖీలలో వెలుగు చూసింది. బిఈడి, ఎంబిఎ కళాశాలకు ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు ఎవరు లేకపోవడం, బీఈడీ కళాశాల నందు నర్సింగ్ కళాశాలను నిర్వహించడం తనిఖీలలో బయటపడింది. దీనిపై ఉపకులపతి స్పందిస్తూ కోర్సులనూ ఎందుకు రద్దు చేయకూడదో తాకీదులు ఇవ్వాలని క్రింది అధికారులకు ఆదేశించారు.

మెకానిక్స్ సంరక్షణ అసోసియేషన్ లక్ష్యం

తిరుపతి హెల్త్, మార్చి 20 ప్రభాతవార్త ః టూవీలర్స్ మెకానిక్స్ వారి కుటుంబాల సంరక్షణ లక్ష్యంగా అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని శ్రీ బాలాజీ టూవీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ స్పష్టం చేశారు. అసోసియేషన్ నెలవారి సమావేశం యూత్ హాస్టల్ ఆవరణంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి బోస్ కంపెనీ ప్రతినిధులు విచ్చేసి మెకానిక్ బైక్ సర్వీస్ పాయింట్‌పై అవగాహన కల్పించి లేబర్ లైసెన్సులు అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్స్‌కు అందజేశారు. అనంతరం బోస్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ వీఎస్ హరిప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ చందు, ట్రెజరర్ ఎస్. షపీ, జాయింట్ సెక్రటరీ వి. ఆనంద్, సలహాదారుడు ఏఎం గోపి, కమిటి సభ్యులు మధు కుమార్ ప్రసాద్, జాకీర్ గోపి, విశ్వనాథ్‌తో పాటు వ్యవస్థాపకులు ఎన్ఆర్ భాషా కృష్ణారెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

మాజీ సిఎంను కలసిన సిరాజ్

శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త

మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లి లోని ఆయన నివాసంలో శ్రీకాళహస్తికి చెందిన మాజీ వక్ఫ్‌బోర్డు కు చెందిన షేక్ సిరాజ్ మర్యాదపూర్వకంగా కలసినారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పవిత్ర మాసం రంజాన్ నెల ముస్లింలకు ఎంతో పవిత్ర మైందన్నారు. ఈ సందర్భంగా ఈనెల 26న విజయ వాడలో జరిగే ఇఫ్తార్ విందులో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు హాజరుకావాలని కోరారు. ఈ ఇఫ్తార్ విందుపై రాష్ట్ర మైనారిటి సెల్ అధ్యక్షుడు వి. ఖాదర్‌బాషాతో చర్చించినట్లు సిరాజ్ వివరించారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతిజిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మెన్ షేక్ సిరాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

డొక్కాసీతమ్మ అన్నదానం

శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వినూత కోట సారధ్యంలో గురువారం ఆర్‌టిసి బస్టాండ్ కూడలిలో అన్నదానం జరిపారు. ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కాసీతమ్మ స్ఫూర్తితో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి వినూత వివరించారు. 36 వారాలుగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మన్నారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. అన్నదాన కార్యక్రమాల్లో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, రిటైర్డ్ తహశీల్దార్ చంద్రశేఖర్, చిరంజీవి, దినేష్, వెంకటరమణయాదవ్, దినేష్, శ్రీను, మునిచంద్ర, వెంకటేష్, దినేష్, మునికుమార్, సాయి, చందు, మహేష్, చందు, దివాకర్, వీరమహిళలు కవిత, శారద, గాయత్రి బత్తెమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు

సర్యూలేషన్ ప్యాటర్న్స్ ప్రకటన

శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పురపాలకసంఘంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్కులేషన్ ప్యాటర్న్స్ ను ప్రకటించబడిందని వీటి మీద ఏవైనా అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ బియస్‌గిరికుమార్ గురువారం ప్రకటించారు. ఈమేరకు మున్సిపల్ నోటీసు బోర్డులో పాటు అన్ని ప్రభుత్వ కార్యాల యాల్లో ప్రకటించారు. కమిషనర్ గిరికుమార్ మాట్లాడుతూ గతంలో తాము ప్రకటించిన 30 అడుగుల రోడ్లు పక్కన భవనాలు నిర్మించుకునే వారి వద్ద అగ్రిమెంట్ చేసుకొని అనుమతించేవారమని వివరించారు. అయితే వాటిని మినహాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసినట్లు వివరించారు. ముఖ్యంగా వార్డులు 2,4,8,26లు కార్యదర్శులు 2,3,18ల పరిధిలో ఈ మినహాయింపు ఉందన్నారు. ఇంకా ఏమైనా అభ్యంతరాలుంటే ఏడు రోజుల లోపల మున్సిపాలిటికి తెలియజేయాలని కమిషనర్ కోరారు.

ఒకరికి శిక్ష ఒకరికి రక్ష

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి రూరల్ పరిధిలో ఎర్రచందనం అక్రమరవాణా కేసులో న్యాయస్థానం ఒకరికి ఏడాది శిక్షతో పాటు రూ.10వేలు జరిమాన విధించగా మరొకరిపై నిందారోపణ రుజువు కానందువల్ల ఆతనిపై కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పినట్లు సిఐ రవినాయక్ వివరించారు. వివరాలు ఇలా ఉన్నాయి, శ్రీకాళహస్తి రూరల్ పరిధి నుంచి ఎర్రచందనాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న సంఘటనలో ఇద్దరిని అదుపులోతీసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. మేలచ్చూరు గిరిజనకాలనీకి చెందిన ఎల్లం పల్లిజయరామయ్య(55) పై రుజువు అయినందువల్ల ఒక సంవత్సరం కఠిన కారాగారశిక్ష రూ.10వేలు జరిమాన విధించారు. ఈ కేసుపై ప్రత్యేక కోర్టులో అడిషనల్ డిస్ట్రిక్ జడ్జ గురువారం తీర్పు వెలువరించారని తెలిపారు. ఇక మరో నిందితుడు ఎం. చినబాబుపై కేసు రుజువు కానందువల్ల ఆతనిపై కేసు కొట్టివేసినట్లు వివరించారు.

వనరాజ కోళ్ళ పంపిణి

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో గురువారం తిరుపతి పశువైద్య విశ్వ విద్యాలయం వారు నవరాజ కోళ్ళను పంపిణి చేసారు. పశువైద్య విశ్వవిద్యాలయం, అఖిల భారత సమన్వయ కోళ్ళ పరిశోధన ప్రాజెక్టులో భాగంగా రెండవ దశలో ఊరందూరులో పంపిణి కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ముఖ్యఅతిది డీన్ డాక్టర్ వీరబ్రహ్మం మాట్లాడుతూ పరిశోధన ఫలాలు రైతుల వద్దకు చేర్చటంలో ముఖ్య ఉద్దేశమన్నారు. పెరటి కోళ్ళ పెంపక ద్వారా తక్కువ ఖర్చుతో జీవనోపాధి పోషకాహారం లభిస్తుందని తెలిపారు. ఊరందూరు దళిత వాడలో 32 మందికి ఒక్కొక్కరికి 8 వనరాజ కోళ్ళను దాణాను, మందులు, నీటితొట్టె, పంజరంను అందించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య మాట్లాడుతూ వనరాజు కోళ్ళు అధిక వ్యాధి నిరోధక శక్తిని కల్గి ఉంటాయని వివరించారు. కోళ్ళ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ షకీలా మాట్లాడుతూ ఆర్థిక లాభాల కొసం కోడి పెట్టెలను ఒకటిన్నర సంవత్సరం కోడి పుంజులను14 లేదా 16వారాల వయస్సు వచ్చే వరకు పెంచాలన్నారు. ప్రొఫేసర్ రాంబాబు నాయక్ అధ్యక్షతన జరిగిన పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్‌వి శ్రీకాంత్‌బాబు, ఊరందూరు కు చెందిన డాక్టర్ ఊహా, అసిస్టెంట్ ప్రొఫేసర్ డాక్టర్ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ కార్డుకు ఈకెవైసి చేసుకోండి..!

రామచంద్రాపురం, మార్చి 20 ప్రభాతవార్త: రేషన్ కార్డు కలిగివున్న లబ్దిదారులు ఈకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలని తహశీల్దార్ వెంకటరమణ అన్నారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ నెల నుండి రేషన్ షాపులో నిత్యవసర వస్తువులు తీసుకోవాలంటే ఈకెవైసి తప్పనిసరి చేసుకోవాలన్నారు. పౌరసరఫరాల శాఖ అందించే నిత్యవసర వస్తువులు లబ్దిదారులకు చేరవేయడంలో పారదర్శకత పాటించడం కోసం జాతీయ సమాచార సంస్థ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ నమోదులోచేసుకోనివారివివరాలు సంబంధిత సచివాలయాలకు రెవెన్యూ శాఖ సమాచారం అందించిందన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

తిరుపతి హెల్త్, మార్చి 20 ప్రభాతవార్త ః ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడిని అనుసరించి ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల తమ కుటుంబ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించి ఆరోగ్యంగా జీవించాలని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి వైద్యులు పవన్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. టూ వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి, వాసన్ కంటి ఆస్పత్రి సహకారంతో గురువారం గాంధీభవన్ ఆవరణంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టూవీలర్స్ మెకానిక్స్ వారి కుటుంబాలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యం మెకానిక్ వృత్తిలో శ్రమించే మెకానిక్ కార్మికులు నేటి ఆధునిక సమాజంలో ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన కలిగి తమ ఆరోగ్యంతో పాటు కుటుంబాలను ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. అనంతరం టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆవుల మునిరెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ డెలివరీ కార్యక్రమంలో భాగంగా కార్మికులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఉచిత వైద్య శిబిరం చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం మెకానిక్స్ వారి కుటుంబ సభ్యులు 300 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణాద్రి ఆస్పత్రి వైద్యులు కె. కృష్ణకుమారి, ప్రియాంక, వాసన్ కంటి ఆస్పత్రి వైద్యులు పి. శ్రీనివాసులు, డాక్టర్ సుజాత, శివకుమార్ సిబ్బంది, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రభు, కార్యదర్శి జలంధర్, సహాయ కార్యదర్శి గురు ఆచారి, కోశాధికారి బాబు, కమిటి ఇంచార్జి సోమశేఖర్, నాగరాజు, కేశవ, జాకీర్, మెకానిక్ కార్మికులు పాల్గొన్నారు.

5వ తరగతి, బ్యాక్ లాగ్ ప్రవేశం కోసం దరఖాస్తు గడువు పెంపు

– ప్రిన్సిపాల్ కె. రేష్మ

తిరుపతి కలెక్టరేట్, మార్చి 20 ప్రభాతవార్త ః మహ

గూడూరు డివిజన్

దేవస్థానంకు మంగళసూత్రం వితరణ

చిల్లకూరు, మార్చి 20 ప్రభాతవార్త : మండలం తమ్మినపట్నం గ్రామంలో వెలిసియున్న శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానంలో సీతమ్మ వారికి తమ్మినపట్నం గ్రామ వాస్తవ్యులు ముత్యాల రఘు రామయ్య, వెంకట సుబ్బమ్మల కుమార్తెలు, అల్లుడులు కరణం మాల్యాద్రి సతీమణి శ్రీవాణి, వడ్డాది దుర్గాప్రసాద్ సతీమణి కుసుమ కుమారిలు 80వేల రూపాయలు విలువ చేసే మంగళసూత్రాన్ని ఆలయ కార్యనిర్వాహనాధికారి గిరికృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సతీష్‌యాదవ్‌కి అందజేసారు.

మోండలీస్ కంపెనీచే క్రీడాకారులకు చేయూత

గూడూరు, మార్చి 20 ప్రభాతవార్త : మోండలీస్ సహకారంతో మ్యాజిక్ బస్సు వాళ్ళు నెల్లూరులో 25 నుండి 28వ తేదీ వరకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. గురువారం గూడూరు జడ్పి బాలుర బాలి కల ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీల్లో గూడూరు మండలం, సూళ్లూరుపేట మండలం, తడ, బి ఎన్.కండ్రిగ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలో ఎంపికైన 34 మంది విద్యార్థులు హిమాచల్‌లో జరిగే జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని మోండలీస్ కంపెనీ వారు 2 లక్షల 70 వేల రూపాయలు ఖర్చు చేసి పోటీలకు తీసుకు వెళ్తున్నారు. ఈ 34 మంది విద్యార్థుల ఖర్చు మొత్తం మోండలీస్ కంపెనీ సహకారంతో మ్యాజిక్ బస్సు వారు అందజేస్తున్నారు. ఈ కబడ్డీ పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ వెంకట సుబ్బయ్య ఎంతగానో కృషి చేశారు. ఈ పోటీలకు సహకరించిన మోండలీస్ సంస్థను అన్ని స్కూల్లో హెచ్ఎంలు అభినందించారు.

22న ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

తడ, మార్చి 20 ప్రభాతవార్త: ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో గూడూరులోని డిఆర్‌డబ్ల్యు డిగ్రీ కళాశాలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తడ ఐటిఐ అధికారులు తెలిపారు. ఈ మేళాలో బహుళ జాతి కంపెనీలలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు చేస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైన యువతీ యువకులు అర్హులుగా ఉన్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యానగర్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్

కోట, మార్చి 20 ప్రభాతవార్త: కోట మండలం చెందోడు సబ్‌స్టేషన్‌లో గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈ అదాలత్‌కు విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస్ ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, ఈఈ నరేంద్రరెడ్డి, ఎడి చిన్నయ్య పాల్గొన్నారు. ఈ అదాలత్‌లో వివిధ గ్రామాల నుంచి 15 మంది రైతులు వినతిపత్రాలు అందజేశారు. ఆ వినతిపత్రాలపై అధికారులు దిశదశ నిర్దేశం చేశారు.

ఎమ్మెల్యేని కలిసిన టిడిపి నేతలు

కోట, మార్చి 20 ప్రభాతవార్త: కోట మండలంలో అభివృద్ధి పనుల కోసం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను గురువారం తాడేపల్లిలోని సచివాల యంలో కలిశారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఆయనను కోరారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో జిల్లా తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, కోట ఎంపిటిసిలు దారా సురేష్, షంషుద్దిన్‌లు ఉన్నారు.

మెగా అభిమానులచే రక్తదానం

సూళ్లూరుపేట, మార్చి 20 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మెగాస్టార్ చిరంజీవి సేవాసంఘానికి చెందిన యువకులు గురువారం ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక వ్యక్తిని కాపాడేందుకు రక్తదానం చేశారు. తిరుపతిలోని బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్సల ఆసుపత్రిలో ఉన్న వ్యక్తికి ఎ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో సూళ్లూరుపేటలోని చిరంజీవి సేవాసంఘం అధ్యక్షులు మాబాషా చొరవ తీసుకొని ఆసుపత్రికి వెళ్లి తమ సంస్థ సభ్యులైన చైతన్య, హయద్, హరీష్, బబ్లూల ద్వారా రక్తదానం చేశారు.

నిర్లక్ష్యం... అవకతవకలు తగదు!

-ఆగ్రహం వ్యక్తం చేసిన పీడీ శ్రీనివాస్ ప్రసాద్

వాకాడు, మార్చి 20 ప్రభాతవార్త : మండలంలోని 2023 - 2024 గత ఆర్థిక సంవత్సరంలో జరిగినటువంటి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పనుల్లో భాగంగా మేట్‌లతో పాటు వివిధ శాఖలో సిబ్బంది పనిచేయడంలో నిర్లక్ష్యం అవకతవకలు జరిగినట్లు గుర్తించడం జరిగిందని ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం వాకాడు మండల పరిషత్ కార్యాలయం మహాత్మా గాంధీ ఎన్ ఆర్‌ఈజీఎస్ కార్యాలయం ఆవరణంలోని జిల్లా ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో సామాజిక తనికి బహిరంగ వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గత ఆర్థిక సంవత్సరంలో 8 కోట్ల 28 లక్షల రూపాయలుతో ఉపాధి హామీ పనులు జరిగాయని తెలిపారు. మండలంలోని పలు పంచాయతీలలో మేట్లను, సిబ్బంది పై పిడి శ్రీనివాస్ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు, ఏపీఓ పనితీరు నిర్లక్ష్యంపై మండిపడ్డాడు, పనులలో కొన్ని పంచాయతీలలో అనుకున్న పనులు జరగలేదని, ఆవేదన వ్యక్తం చేశారు, కల్లూరు, వాకాడు, ముట్టెంబాక గ్రామాలలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చాలని ఆయా గ్రామ పంచాయతీ ప్రజలు పిడికి ఫిర్యాదు చేశారు. వాకాడు, ముట్టెంబాక, కల్లూరు మెట్లపై వేరి చేసి నివేద కు తనకు పంపిం చాలని సంబంధించిన అధికారులకు ఆయన సూచించారు, మండలంలోని రావిగుంటపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ను పీడీ శ్రీనివాస్ ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బిజెపి గూడూరు నియోజకవర్గం కన్వీనర్ పురుషోత్తంరెడ్డి, టిడిపి నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డిలు, గ్రామ ప్రజలుతో కలిసి వాకాడు ఫీల్డ్ అసిస్టెంట్‌ను మార్చివేయాలని పీడీకి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీడి చిరంజీవి, ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, సర్పంచులు దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీడీవో గోపీనాథ్, కోట ఏపీవో పూర్ణిమ, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

గేట్‌లో ఎన్‌బికెఆర్ మెకానికల్ విద్యార్థుల ప్రతిభ

కోట, మార్చి 20 ప్రభాతవార్త: దేశంలోనే ఐఐటిలు, పలు ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వమించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూట్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్) 2025 ఫలితాల్లో ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి మెకానికల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఆ మేరకు ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి విక్రమ్ కుమార్‌లు అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఫైనలియర్ చదువుతున్న వడ్లపూడి దినేష్, చింతమాను మహేష్ గేట్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్ పేపర్‌లో వరుసగా జాతీయ స్థాయిలో 309, 597 ర్యాంకులను, గేట్ ఇంజనీరింగ్ సైన్స్ పేపర్‌లో కురువ అశోక్ జాతీయ స్థాయిలో 939 ర్యాంకు కైవశం చేసుకున్నట్లు తెలిపారు. అధ్యాపకుల ఉత్తమ బోధన ద్వారా గత సంవత్సరం మెకానికల్ విద్యార్థులు గేట్‌లో రెండు ర్యాంకులు, ఈ ఏడాది ఐదు ర్యాంకులు సాధించడం గొప్ప పరిణామం అన్నారు. అనంతరం మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో గేట్ ఎగ్జామ్‌పై అవగాహన కల్పించి డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. గేట్ పరీక్షలకు శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

కళాశాలలో కెరియర్ గైడెన్స్‌పై అవగాహన

సూళ్లూరుపేట, మార్చి 20 ప్రభాతవార్త : పట్టణం లోని విఎస్ఎస్‌సి డిగ్రీ కళాశాలలో టాటా కెమికల్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యం లో గురువారం విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో విద్యార్థులు ఉద్యోగావ కాశాలు ఎలా అందిపుచ్చు కోవాలనే అంశంపై శిక్షణ ఇచ్చారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బి శంకర్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టాటా కెమికల్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ కంపెనీ హెచ్ఆర్ వరలక్ష్మి, సతీష్, శ్రావణ్, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే సంజీవయ్య విమర్శలు

- మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం

సూళ్లూరుపేట, మార్చి 20 ప్రభాతవార్త : మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విజిటింగ్ ప్రొఫెసర్‌లా వ్యవహరిస్తూ ఉనికి కోసమే విమర్శలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. మాజీ అయినప్పటికీ సంజీవయ్యకు బుద్ధి రాలేదని అన్నారు. ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ బాగుంటుందని, కానీ అర్థం లేని విమర్శలు చేయడం ఆయన నైజమని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం మీద విమర్శలు చేస్తూ ఆయన ధర్నాలు చేయాలని పార్టీ కార్యకర్తలకు సూచించడం సమంజసంగా లేదన్నారు. ప్రభుత్వం వచ్చి 10నెలలే అయినప్పటికీ రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తూ 10లక్షల కోట్లు అప్పును చేసి వెళ్లిన జగన్‌మోహన్‌రెడ్డిని కిలివేటి ప్రశ్నించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసా రత్నం, టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, చిట్టేటి పెరుమాళ్లు, అలవల శ్రీనివాసులు, మేడా సాయి, కొక్కు శంకరయ్య, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ఉపాధి కల్పించండి:సిపిఎం

వెంకటగిరి, మార్చి 20 ప్రభాతవార్త : సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వెంకటగిరిలో 1,2,3 వార్డుల్లో బంగారుపేట ఏరియాలో ప్రజా సమస్యల పరిష్కారాలకై ప్రజా చైతన్య యాత్రలు సిపిఎం పార్టీ చేపట్టడం జరిగింది. సిపిఎం నాయకులు దృష్టికి స్థానికులు అనేక సమస్యలను తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రలు జరుగుతున్నాయని అన్నారు. అందులో భాగంగానే వెంకటగిరి పట్టణంలో చైతన్య యాత్రలు చేపట్టడం జరిగిందని అన్నారు. చేనేత కార్మికుల్ని సాధారణ ప్రజల్ని కలిసి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగిందని అన్నారు. చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉందని అన్నారు. పట్టు పేక నూలు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నెలలో 15 రోజులు కూడా వీరికి పని దొరకడం లేదని అన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని అన్నారు. చేనేత కార్మికులకు ఉచితంగా 200 యూనిట్ లు విద్యుత్ ఇస్తామని కూటమీ ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. కచ్చితంగా అమలు జరిపి చేనేత కార్మికులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, బంగారుపేటశాఖ కార్యదర్శి ఐలాభాస్కర్, సుబ్బరాయులు చంద్రశేఖర్, రత్నమ్మ, నారాయణ, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంగీతమే నా ప్రాణం : మ్యూజిక్ డైరెక్టర్ బి.జి.షిర్డి

కోట, మార్చి 20 ప్రభాతవార్త : అపారమైన కృషితో సంగీత ప్రపంచంలో తనదైన శైలిలో పాటల రచయితగా, సంగీత దర్శకురాలిగా, గాయనిగా గుర్తింపు తెచ్చుకొని సాహిత్య విలువలతో సరికొత్త సంగీతాన్ని అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు బి.జి.షిర్డి. తిరుపతి జిల్లా కోట గ్రామంలో జన్మించిన ఆమె సంగీతంతో పాటు చిత్రలేఖనం, ఫొటోగ్రఫి వంటి కళల్లో కూడా విద్యార్థి దశలోనే ఎన్నో బహుమతులు అందుకుంది. తల్లిదండ్రులు అరుణ, నారాయణ స్వామి ప్రోత్సాహంతో విద్యలో ప్రతిభ కనబరుస్తూ వచ్చారు. అస్సాంలో జరిగిన జాతీయ సాంస్కృతిక శిబిరంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం బృందానికి గాయనిగా, కీబోర్డు ప్లేయర్‌గా ప్రాతినిధ్యం వహించారు. భారతీయ మరియు వెస్ట్రర్న్ క్లాసికల్ మ్యూజిక్ నేర్చుకున్నారు. ఐటి రంగంలో కెరియర్ మొదలైనప్పటికీ సంగీతంపై ఉన్న మక్కువను వదలకుండా 2008లో ప్రముఖ టివి ఛానల్స్‌లో నిర్వహించిన పాటల పోటీల్లో పాల్గొని విజయాలు సాధించి సంగీత దర్శకులు శశిప్రీతం, ఎంఎం శ్రీలేఖ వంటి ప్రముఖుల ప్రశంసలు పొందారు. వృత్తిపరంగా అమెరికాలో ఐటి రంగంలో ఉంటూనే సంగీతం మీద ఇష్టంతో ఎంతో మంది సంగీత ప్రియులను తన పాటలతో అలరిస్తున్న షిర్డి యూట్యూబ్ సింగల్స్, ఆల్బమ్స్, సినిమాలకు సంగీతం అందించారు. ముఖ్యంగా కౌగిలి అనే సినిమాకు పాటలు రాసి, స్వయంగా బాణీలు సమకూర్చారు. విజయ్, ఏసుదాస్, కార్తీక్, హేమచంద్ర, ఎస్‌పి కరుణ్య, శ్రీరామంద్ర, హరిచరణ్, సునీత, శిరీష భాగవతుల, ప్రవీణ్‌కుమార్ వంటి ప్రముఖ గాయకులు షిర్డి సంగీత దర్శకత్వం వహించిన రచించిన పాటలను పాడారు. ప్రతి పాటలోనూ తన హృదయాన్ని కలపడం, అద్భుతమైన రాగాలను మేళవించడం ఆమె ప్రత్యేకత.

ఘనంగా టిడ్కో చైర్మన్ జన్మదిన వేడుకలు

వెంకటగిరి, మార్చి 20 ప్రభాతవార్త : జనసేన పార్టీ సీనియర్ నాయకులు జంపాల ప్రకాష్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మరియు రాష్ట్ర ప్రభుత్వ ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని బాలసదన్‌లో చిన్నారుల మధ్య అట్టహాసంగా ఈ కార్యక్రమం పార్టీ శ్రేణులు నిర్వహించారు.కార్యక్రమంలో సిహెచ్‌సి హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ మెంబర్ రాధమ్మ, సీనియర్ నాయకులు చిరంజీవులు, మధు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

చిల్లకూరు, మార్చి 20 ప్రభాతవార్త: రాజనేని రామా నాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చిల్లకూరులోని పోలీస్ స్టేషన్, ఒరగలి క్రాస్ రోడ్డు, గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, పాతబస్టాండ్, కోర్టు సెంటర్ ప్రాంతాలలో మజ్జిగ మరియు మంచినీటి చలివేంద్రాలను ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో కార్యదర్శి రామయ్య నాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో చిల్లకూరు ఎస్సై సురేష్ బాబు, ఆర్టీసీ పీఎం వెంకటేశ్వర్లు, ట్రస్ట్ సభ్యులు బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది

గూడూరు, మార్చి 20 ప్రభాతవార్త : తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిదని లయన్ షేక్ రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం దర్గా వీధిలోని తమ నివాసం నందు లయన్ షేక్ రియాజ్ అహ్మద్ తల్లిదండ్రు లు షేక్ వజీర్ అహ్మద్, ఖాదర్ బిల జ్ఞాపకార్థం గత కొన్ని సంవత్సరాలుగా రంజాన్ పండుగను పురస్కరించుకుని నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం చేస్తున్నారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా నిరుపేద ముస్లిం మహిళలకు వందమందికి కాటన్ చీరలు జాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ షేక్ రియాజ్ అహ్మద్, దర్గా వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ మొహమ్మద్ మగ్దూమ్ మొహిద్దీన్, షేక్ ఇలియాజ్ అహ్మద్, షేక్ హఫీజ్ అహ్మద్,షేక్ నూర్ అహ్మద్, మనవడు షేక్ మొహమ్మద్ హుస్సేన్,షేక్ కాలేషా, షేక్ చాన్ బాషాలు పాల్గొన్నారు.

షాదీమహల్‌కు అందాలు...ఆవరణంతా సుందరీకరణ

శ్రీకాళహస్తి,మార్చి 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మైనారిటి ముస్లింలకు గత ఏడాది బక్రీద్ సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రంజాన్ పండగకు ఆహ్లాదకర వాతావరణంలో ప్రార్థనలు చేసుకోవటానికి రూ.50 లక్షలతో ఈద్‌గాహ్‌ను సుందరీకరణ చేయటమే కాకుండా భూత్ బంగ్లాగా ఉన్న షాదిమహల్‌ను అందంగా తీర్చి దిద్దుతున్నారు. ఇప్పటికే షాదీమహల్‌కు సరికొత్త అందాలు అద్దుతున్నారు. ఆవరణంతా సుంద రీకరణ చేసారు. కొన్ని సంవత్సరాలుగా ఈద్‌గాహ్ పరిసరాల్లో ముళ్ళపొదలు పెరిగి గందగోళంగా కనబడేది. అయితే తాను మైనారిటి ముస్లింలకు ఇచ్చిన మాట ప్రకారం అందాలు దిద్దుతున్నారు. రంజాన్ నాటికి ముస్లింలు నచ్చే రీతిలో ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమాలను జామియామస్‌జిద్ ముతవల్లి అక్రం సాహెబ్, సహాచరులు అంజద్‌బాషా, ఖాజీ మున్నాసాహెబ్, తాజ్‌ల సహకారంతో సుందరీకరణ పనులు చేపట్టారు. నాడు గోపాలకృష్ణారెడ్డి స్థలాలు కేటాయిస్తే తనయుడు సుధీర్‌రెడ్డి సకల సదుపాయాలు కల్పిస్తూ సుందరీకరణకు పూనుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య!

తిరుచానూరు, మార్చి 20 ప్రభాతవార్త : తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిదిలో గుర్తు తెలియని వ్యక్తి హత్య తీవ్ర కలకలం రేపింది. యన్ హెచ్ 150 జాతీయ రోడ్డు సమీపాన తిరుపతి గ్రామీణ మండలం వేదాంతపురం గ్రామపంచాయతీ పరిధిలో సగం కాలి పోయిన మృతదేహం స్థానికులు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు.స్థానికులు సమాచారంతో తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారం తెలిపారు.జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సంఘటన స్థలానికి చేరుకొని హత్య జరిగిన విధానాన్ని పరిశీలించి కేసును త్వరగా చేదించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న చంద్రగిరి సబ్ డివిజన్ డిఎస్పి ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు 19వ తేదీ రాత్రి ప్రముఖ హోటల్ సమీపంలో పూతలపట్టు –నాయుడుపేట రహదారి దగ్గరగా ఉన్న ఖాళీ స్థలంలో ఒక వ్యక్తిని వేరొక చోట హత్య చేసి ఇక్కడ పడేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ దర్యాప్తులో తిరుచానూరు పోలీస్ స్టేషన్ సిఐ సునీల్ కుమార్,ఎస్సైలు సాయినాథ్ చౌదరి, అరుణ పాల్గొన్నారు.

ఎట్టకేలకు వెటర్నరీ జూడాల సమ్మె విరమణ

తిరుపతి విద్య, మార్చి 20 ప్రభాతవార్త : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ జూడాలు ఎట్టకేలకు నిరవధిక సమ్మెను విరమించారు.గత 46 రోజులుగా తరగతులు బహిష్కరించి అన్ని వైద్య విభాగాలలో జూడాలకు ఇస్తున్న స్టైఫండకు సమానంగా తమకూ గౌరవేతనం అందించాలని సమ్మెబాట పట్టి పశువైద్య విద్యార్థులు గురువారం సమ్మెను విరమించినట్లు ప్రకటించారు. ప్రభుత్వం రూ.7వేల నుంచి రూ.10,500కు పెంచుతూ జీవో జారీ చేయడంతో తాత్కాలికంగా సమ్మెను విరమిస్తున్నట్లు వీసీ రమణకు,వర్సిటీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

ప్రమాదంలోకి నెట్టేస్తున్న కార్చిచ్చు

పాకాల, మార్చి 20 ప్రభాతవార్త : మండలంలో ఒకవైపు ఎండలు పెరిగి ప్రజలు అల్లాడిపోతూ ఉంటే మరోవైపు చిన్నపాటి గుట్టలు, అడవులను కొంత మంది కావాలనే సొంత లాభం కొరకు తగలబెట్టడం దురదృష్టకర పరిణామమని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి వెంకటాద్రి నాయుడు పేర్కొన్నారు. మండలంలోని అడవులను గుట్టలను ఆనుకుని ఉన్న మామిడి తోటల కంచెలు ఈ అగ్ని కీలలకు ఆహుతై మామిడి తోటలు కూడా కార్చిచ్చుకు కాలిపోతూ రైతులపై ప్రతి సంవత్సరం తీవ్ర ప్రభావం పడుతుంది. అడవులు ప్రజలకు ప్రధాన ఆక్సిజన్ ఉత్పత్తి వ్యవస్థలు కాగా వాతావరణ మార్పులను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇటువంటి అడవులు తగలబెట్టడం వల్ల కలిగే ప్రభావాలు వాతావరణ మార్పుల గాలిలో కార్బన్ డయాక్సైడ్ వాయువు విడుదలై ఇది వాతావరణ మార్పులకు కారణమవుతోంది. మరోవైపు జీవ వైవిధ్యం, అనేక జాతుల జీవులు నివాసాలను కోల్పో తాయి, భూతాపాన్ని పెంచి ప్రజల వేసవి తాపానికి లోనై వడదెబ్బ తగిలి అమాయకపు ప్రజల ఆరోగ్య హానికి దారితీస్తుంది. అడవులు తగలబెట్టడం వల్ల నేల క్షీణత ఏర్పడుతుంది, ఇది వ్యవసాయం మరియు పర్యావరణ వ్యవస్థలకు హాని కలిగిస్తుంది. ఇప్పటికైనా పాకాల మండలంలోని అటవీ శాఖ సిబ్బంది స్థానిక సచివాలయాల మహిళా పోలీస్ సిబ్బంది సమన్వయం చేసుకొని గ్రామాలలో అడవుల దహనంపై ప్రజలలో అవగాహన కల్పించి ముమ్ముందు ఇలాంటి చర్యలకు ఎవరూ పాల్పడకుండా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా అటవీశాఖ ఉన్నతా ధికారులను వారు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, మార్చి 20 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి, తిరుమల పర్యటన సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్లను కమిషనర్ ఎన్.మౌర్య గురువారం పరిశీలించారు. మామిడికాయల మండీ నుండి అలిపిరి వరకు పారిశుద్ధ్య పనులను, బారికేడ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి తిరుపతి, తిరుమల పర్యటన సందర్భంగా ఎలాంటి చిన్న పొరపాట్లుకు తావులేకుండా ఆయా విభగలా అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయ వంతం చేయాలన్నారు. కమిషనర్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి బాలాజి, డిఈలు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

ఆట వస్తువులను అందించండి

గూడూరు, మార్చి 20 ప్రభాతవార్త: పట్టణ ప్రజలందరూ తమ నివాసాలలో నిరుపయోగంగా ఉన్న ఆట వస్తువులను అందుబాటులో ఉన్న అంగన్వాడి పాఠశాలలకు అందిస్తే అక్కడ చదివే పిల్లలకు ఉపయోగ పడతాయని గూడూరు ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ గౌరవాధ్యక్షురాలు డాక్టర్ వెల్లడించారు. సంస్థ గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ అంగన్వాడి పాఠశాలలో పేద పిల్లలు చదువుతూ ఉంటారని తమ నివాసాల్లో నిరుపయోగంగా ఉన్న బొమ్మలు వారికి ఇస్తే ఉపయోగపడతా